వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
VC NEWS
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ జనవరి 18 శనివారం 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 180
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం



ఇది ముమ్మాటికీ నాటి కెసిఆర్ ప్రభుత్వ

విజయం

ప్రకటనలో వెల్లడించిన మాజీమంత్రి హరీష్ రావు

2లో

# స్కిల్ వర్సిటీకి టెక్నికల్ సహకారం

## సింగపూర్ యూనివర్సిటీతో ఎంఓయూ

## సిఎం రేవంత్ సమక్షంలో కీలక ఒప్పందం



**హైదరాబాద్:** నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) సంస్థతో ఎంఓయు కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్‌ల సమక్షంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ శుక్రవారం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సింగపూర్ ఐటీఈ పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా.. పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి తొలిరోజు పర్యటనలోనే ఈ కీలక ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో తొలిరోజు విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. దీనిపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనుంది. కాగా.. ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వీవీఎన్ బాలకృష్ణతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ భేటీలో పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు



2లో

- సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కడిక్కడ నిలదీయండి
- బాకీలు అడిగినట్లుగా కాంగ్రెస్ నేతలను అడగండి
- తులం బంగారం సహా హామీలపై ప్రశ్నించండి
- చేవెళ్లలో ఉప ఎన్నిక రావడం ఖాయం
- హామీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటా
- షాబాద్ బిఆర్ఎస్ రైతు ధర్నా సభలో కెటిఆర్

రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు



## 31నుంచి బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. రెండు విడతల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 31న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు





## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

2లో

మినీ వ్యాన్, బస్సు ఢీకొని 9 మంది దుర్మరణం



2లో

## మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

బిజెపి సంకల్ప్ పాత్రపై కేజ్రీవాల్ విమర్శలు

## యోనో యూజర్లకు హెచ్చరిక

**ముంబై:** ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన యూజర్లను అలర్ట్ చేసింది. యూజర్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఆండ్రాయిడ్ 11, అంత కంటే తక్కువ వెర్షన్ మొబైల్స్‌లో యోనో సేవల్ని నిలిపి వేయనుంది. ఈ మేరకు పాత వెర్షన్ వాడుతున్న స్టేట్ బ్యాంక్ కస్టమర్లకు సందేశాలు పంపుతోంది. యూజర్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28 లోపు పాత వెర్షన్ ఫోన్లు వాడుతుంటే వారు ఆండ్రాయిడ్ 12 అంత కంటే కొత్త వెర్షన్‌కు అప్‌గ్రేడ్ అవ్వాల్సి ఉంటుంది. లేకపోతే యోనో సేవలు నిలిచిపోతాయని స్పష్టం చేసింది.

yono SBI

# పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

### కొత్త కార్డులను 26 నుంచి ఇవ్వబోతున్నాం

### విపక్షాల దుష్ప్రచారం నమ్మకండి

### మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ



**కరీంనగర్:** పాత రేషన్ కార్డులు తొలగిస్తారనే ప్రచారం అబద్ధమని, అలాంటివి నమ్మవద్దని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని మంత్రి పొన్నం చెప్పారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ? 'జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వవచ్చని తెలిపారు. 'పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నాం. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాగా.. ఆరు గ్యారెంటీలను రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే పలు హామీలను రేవంత్ ప్రభుత్వం అమలు చేసింది. ఈ మేరకు రేషన్ కార్డులపై రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొత్త రేషన్ కార్డులను ఈ నెల26 నుంచి జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపనుంది. మండల స్థాయిలో ఎంపీడీఓతోపాటు యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేదా జీసీఎస్ఓ పర్యవేక్షకులుగా ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ప్రజల దృష్టిని మళ్లించేలా రాజకీయ ఎత్తుగడలు

కేసులపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కెటిఆర్

రైతుభరోసాపైనా రాజకీయ ధర్నాలు

బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ జీవన్ రెడ్డి

2లో



# బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం



**హైదరాబాద్:** కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు.. ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వ విజయమే అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి నుంచి సెక్షన్ 3 ప్రకారం నీళ్ల కేటాయించాలని కేసీఆర్ పట్టుబట్టారని పేర్కొన్నారు. తాజాగా ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని హరీష్ రావు తన ప్రకటనలో తెలిపారు. దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. అసలు ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89 తెచ్చిందే కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ అని గుర్తు చేశారు హరీష్ రావు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని విమర్శించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్‌కు పదేళ్ల కాలం పట్టిందన్నారు. కృష్ణా నదిలో న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని హరీష్ రావు మరోసారి

స్పష్టం చేశారు.కృష్ణా జలాల వివాదంపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కీలక ఉత్తర్వులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2023లో అంతర్రాష్ట్ర జల వివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జారీ చేసిన తదుపరి టర్మ్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట రెండు రాష్ట్రాల వాదనలు వినాలని ట్రిబ్యునల్ నిర్ణయించింది. దీనిపై వాదనలు పూర్తయిన తరువాత ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం తుది వాదనలు వింటామని ట్రిబ్యునల్ ధర్మాసనం పేర్కొంది. తదుపరి వాదనలను ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఎవరి వాటా ఎంత అన్నదానిపై వాదనలు విన్న తర్వాతే ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపుల అంశాన్ని ట్రిబ్యునల్ చేపట్టనుంది.

# మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు



**న్యూఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పాత్ర-1'పై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఇచ్చిన హామీలు 'ఆమ్ ఆద్మీ పార్టీ' నుంచి కాపీ కొట్టారని, తమ పార్టీ ఎంచుకున్న మార్గానే వాళ్లు అనుసరించేటప్పుడు ఏమాత్రం విజన్ లేని బీజేపీని ఎందుకు ఎన్నుకోవాలని ఆయన ప్రశ్నించారు. బీజేపీ 'సంకల్ప పాత్ర'ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం విడుదల చేశారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, గ్యాస్ సిలెండర్లపై రూ.500 సబ్సిడీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. ఢిల్లీలో ఆప్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలన్నింటినీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కేజ్రీవాల్ నిశిత విమర్శలు చేశారు. 'కేజ్రీవాల్ తరహాలోనే ఉచితాలు ఇస్తామంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఈరోజు ప్రకటించారు. నేను ఒకటే అడుగుతున్నాను. ఉచితాలు మంచివి కావని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంతవరకూ చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఉచిత హామీలు గుప్పించడం ద్వారా గతంలో తాము చెప్పినది తప్పని, కేజ్రీవాల్ చేసింది సరైనదేనని ఒప్పుకున్నట్టు అయింది. ఉచితాలు హానికరం కాదని, దేశానికి భగంవతుని ప్రసాదమని మోదీ చెప్పాలి' అని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ పథకాలన్నింటినీ కొనసాగిస్తామని నడ్డా ఇప్పుడు చెబుతున్నారని, ఆ విషయాన్ని సంకల్ప్ పాత్రలోనూ చేర్చారని అన్నారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లను మూసేస్తామని నడ్డా చెబుతుండటంపై తాను ఈరోజు ఢిల్లీ ప్రజల వద్దకు వెళ్లి, మొహల్లా క్లినిక్‌కు కావాలా, వద్దా అని అడిగానని చెప్పారు. మొహల్లా క్లినిక్‌లకు అనుకూలంగా ఉన్న వారు ఆప్‌కు ఓటు వేయాలని, వద్దనుకునే వారు బీజేపీకి ఓటు వేయాలని అన్నారు.

నా పని మరింత మెరుగ్గా ఎలా చేయాలో నాకు బాగా తెలుసు. కేజ్రీవాల్ చేసే పనే మీరు చేస్తే మిమ్మల్ని ఎందుకు ఎన్నుకోవాలని ప్రజలు బీజేపీని అడుగుతున్నారు' అని ఆయన చెప్పారు. బీజేపీ మేనిఫెస్టో క్లుప్తంగా చెప్పాలంటే, కేజ్రీవాల్ చేసిన పనిని బీజేపీ అభినందించిందని చెప్పారు. బీజేపీకి ఒక ఎ÷-లానింగ్ అంటూ ఏదీ లేదని, ఆప్ మేనిఫెస్టోపై, ఆప్ హామీలపై పోటీ చేయాలనుకుంటోందని విమర్శించారు. ఇంతకంటే దరుదృష్టం మరొకటి ఉండదన్నారు. ఎలాంటి విజన్ కానీ, ఆలోచనలు కానీ ఎ÷-లానింగ్ కానీ లేని పార్టీని తన జీవితంలో ఎన్నడూ చూడలేదని బీజేపీపై కేజ్రీవాల్ విమర్శించారు.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం



మినీ వ్యాన్, బస్సు ఢీకొని 9 మంది దుర్మరణం

**పూణే:** పూణే-నాసిక్ హైవేపై మినీ వ్యాన్, బస్సు ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నారాయణగావ్‌లో ఈ ప్రమాదం జరిగింది. జున్నార్ గ్రామాల నుండి ప్రజలను తీసుకెళు_న్న వ్యాన్ ప్రమాదానికి గురైంది. ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొట్టిన మినీ వ్యాన్ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ పూర్తిగా ధ్వంసమైంది. వ్యాన్ ప్రయాణికులతో నారాయణగావ్‌కు వెళుతోంది. బ్రేక్‌డౌన్ కారణంగా బస్సును హైవే పక్కన నిలిపివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణికులు లేరు.

# ఆరు గ్యారెంటీలని..అర గ్యారెంటీ అమలు



రంగారెడ్డి: కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతుబంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఫ్రీ బస్సుతో సరిపెట్టారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు రేవంత్ రూ.30 వేలు బాకీ పడ్డారని.. రూ.30 వేలు ఇస్తేనే ఓటేస్తామని మహిళలు నిలదీయాలని మాజీ మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు తాము సిద్ధమైతే ఈసీకి లేఖ రాసి రైతు బంధును వేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. యాసంగి పంట సమయంలో రైతుల కోసం రూ.7600 కోట్లు పెడితే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక నాట్లు వేసే సమయంలో కాకుండా.. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల ఖాతాలో వేశారని విమర్శించారు. ఒక్కసారి మాత్రమే కేసీఆర్ ఇచ్చిన డబ్బులను రైతు భరోసా కింద వేశారని.. ఆ తరువాత రైతు భరోసా ముచ్చటే లేదన్నారు. ఖచ్చితంగా జనవరి 26న రైతులకు ఇస్తానన్న రైతు భరోసాను ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. అది కూడా రూ.12

వేలు కాదు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలను రైతుల ఖాతాలో జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటకు ఎగ్గొట్టిన రైతు బంధును కూడా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓటేయమని అడిగితే.. ముందు బాకీ తీర్చాకే ఓటు వేస్తామని గట్టిగా చెప్పాలని రైతులకు చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.17500 బాకీ ఉంటే.. మహిళలకు సంవత్సరానికి రూ.30 వేల మేర రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి మోసగాడు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 37 రోజులు కాదు దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో.. భయపడేటోడు ఎవడూ లేడు అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం. పేదల తరపున కొట్లాడుతూనే ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు చిలుకకు చెప్పినట్టు చెప్పిండు కేసీఆర్. కాంగ్రెసోళ్లను నమ్మకండి అని చెప్పిండు. నెలకు 2500 పడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు.

ఈ ఏడాది కాలంలో నాలుగైదు లక్షల లగ్గాలు అయ్యాయి. రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకతలేదా ..? బంగారం షాపుడో నిన్ను నమ్మడం లేదా..? పెళ్లైన ఆడబిడ్డలకు 80 వేల చొప్పున బాకీ ఉన్నాడు. సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు. పచ్చి మోసగాడు.. పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్.. 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి. మనం కేసులు పెట్టినా.. పోలీసులు దరఖాస్తు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది వాళ్లకు. అందుకే ఓట్లప్పుడే రేవంత్ రెడ్డికి చురుకు పెట్టాలని కేటీఆర్ చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో త్వరలోనే ఉప ఎన్నిక రాబోతుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను రైతులు, ఆడబిడ్డలు ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌కు ఓటేయడంతో ఇక్కడున్న ఎమ్మెల్యే గెలిచిండు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సంకలో జొచ్చిండు. అభివృద్ధి కోసం పోయాను అని అంటుండు. ఈ ఏడాదిలో ఏం అభివృద్ధి జరిగింది..? రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా అమలైందా..? ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీ ఇచ్చావా..? ఏం అభివృద్ధి అయింది.. ఉన్నది పీకింది. ఎన్నికలు వచ్చినప్పుడు చేవెళ్లలోనే కాదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల 10 నియోజకవర్గాల్లో బుద్ధి చెబుదాం. రైతు భరోసా వేయనందుకు, వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టినందుకు, రుణమాఫీ మోసం చేసిందుకు, ఆడబిడ్డలకు రూ. 2500 ఇవ్వనందుకు, మా భూమి మాకే ఉండాలన్న పాపానికి 40 మంది రైతులను జైల్లో పెట్టి హంసించినందుకు.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం. చివరకు వృద్ధులను కూడా మోసం చేసిండు. ఆసరా పెన్షన్లు 4 వేలు ఇవ్వడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి నోటికి హద్దు లేదు. మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలు అని చెప్పుకుంటుండు. కేసీఆర్ ఇచ్చిన 44 వేల ఉద్యోగాలను నేను ఇచ్చిన అని చెప్పుకుంటూ మోసం చేస్తున్నాడు. ఇవాళ షాబాద్‌లో జరిగిన ధర్నా మొట్టమొదటి.. మిగతా చోట్ల కూడా ధర్నా చేస్తాం. 70 లక్షల మంది రైతుల పక్షాన, 22 లక్షల మంది కౌలు రైతుల పక్షాన, భూమి లేని నిరుపేదల పక్షాన

అడుగుతున్నాం.. ఇచ్చిన మాట నిలబెట్టుకో.. అందరికీ రైతుభరోసా జమ చేయ్.. లేదంటే రేపు పంచాయతీ ఎన్నికల్లో నీ వీపు చింతపండు చేస్తారు మా ఆడబిడ్డులు, రైతులు. ఇది ఆరంభం మాత్రమే.. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతూనే ఉంటాం.. ఎన్ని కేసులు పెట్టినా.. జైళ్లకు పంపించినా రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు.ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, భారాస నేతలు శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దృష్టిని మళ్లించేలా రాజకీయ ఎత్తుగడలు

**కేసులపై ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న కెటిఆర్**

**రైతుభరోసాపైనా రాజకీయ ధర్నాలు**

**బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ జీవన్ రెడ్డి**

**హైదరాబాద్:** ప్రజల దృష్టిని మళ్లించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్ పోరాటం చేయడంతోనే కాంగ్రెస్ రైతుభరోసా ఇచ్చిందని చెప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చురకలంటించారు. అందుకే బిఆర్ఎస్ నేతలు రైతు దీక్ష చేపట్టారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పాటుపడు తోందని, ఈ నెల 26 నుంచి రైతు భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్‌పై విచారణ జరుగుతోందని, అయితే తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫార్ములా కేసు రేసు నుంచి దృష్టి మరల్చే ఎత్తుగడలను కేటీఆర్ చేస్తున్నారని ఆక్షేపించారు. శుక్రవారం సీఎల్పీ మీడియా పాయింట్‌లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము దీక్ష చేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తుందని చెప్పుకోవడానికి బీఆర్ఎస్ నేతలు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలో దేశంలో ఎక్కడ లేని విధంగా రైతు సంక్షేమం కోసం పాటు పడుతుందని తెలిపారు. రైతు భరోసా పేరుతో ఈనెల 26వ తేదీ నుంచి రైతుకు ప్రోత్సహం కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి



చెప్పారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో రైతు బంధు పేరుతో ఏడాదికి రూ.8వేల నుంచి రూ.10 వేలు ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఇస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రూ.14వేలు కూడా కాంగ్రెస్ ఇవ్వబోతోందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఎకరాకు రూ.500 బోనస్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. రేషన్ కార్డుల పక్రియ కూడా ఈనెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హౌసింగ్ స్కీంను మర్చిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తుందని అన్నారు. బీఆర్ఎస్ 2023 ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ ఎత్తివేసిందన్నారు. బీజేపీ రుణమాఫీ మాట ఊసే ఎత్తలేదని చెప్పారు. కాంగ్రెస్ రుణమాఫీ చేస్తుంటే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి నీతి ఆయోగ్‌లో ప్రస్తావిస్తే బాగుండేదని తెలిపారు. రైతాంగానికి ఉచిత విద్యుత్ మొదటగా కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు.సన్నాలు పండిస్తే తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా రూ.500 బోనస్ ఇవ్వట్లేదని చెప్పారు. రేషన్ కార్డుల జారీని గత ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఈ నెల 26 నుంచి వీటి జారీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.'గత ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు.. వడ్డీ మాఫీ చేసింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారమే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కోసం కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాయం చేసి ఉంటే ప్రభుత్వానికి ఉపయోగపడేది' అని జీవన్‌రెడ్డి తెలిపారు.

# నేరేడ్‌మెట్ పరిధిలో డ్రగ్స్ స్వాధీనం

## నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారుగా గుర్తింపు

## రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వెల్లడి

**హైదరాబాద్:** నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన మహేష్, మహిపాల్‌గా గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్‌మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో వివిధ పద్ధతులు వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్‌కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. ఓలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు. వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కళాశాలల్లోకి వెళ్లి యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నిన్న జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి తమ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు కూడా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారని సీపీ సుధీర్ బాబు తెలిపారు.

# కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసు

**హైదరాబాద్:** కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పది ప్రత్యేక బృందాలతో హైదరాబాద్ సహా రాయ్‌పుర్, బిహార్‌తో పాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసుల గాలింపు కొనసాగుతోంది. కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపి.. నగరంలోకి ప్రవేశించి ఇక్కడ నుంచి రాయ్‌పుర్ మీదుగా పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. దొంగలు హైదరాబాద్‌కు ఎలా చేరుకున్నారనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. కాల్పులు జరిపిన ముఠా బిహార్ పారిపోయిందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ముఠాలో ప్రధానంగా అమిత్‌కుమార్ కీలకంగా ఉన్నట్టు.. అతనిపై బిహార్‌లో దోపిడీ, దొంగతనం వంటి పలు కేసులు ఉన్నట్టు గుర్తించారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. బిహార్ పోలీసులను సంప్రదించిన నగర పోలీసు ఉన్నతాధికారులు అమిత్‌కుమార్ నేరాల చిట్టా గురించి ఇప్పటికే తెలుసుకున్నట్టు సమాచారం. అమిత్ ముఠా కర్ణాటకలోని బీదర్, ఆ తర్వాత హైదరాబాద్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఏటీఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి నగదుతో ద్విచక్ర వాహనంపై పరారై హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. అఫ్జల్‌గంజ్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో రాయ్‌పుర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ట్రావెల్స్ సిబ్బంది బ్యాగులు తనిఖీ చేయడం, కట్టలకొద్దీ డబ్బును చూసి అనుమానంతో ప్రశ్నించడంతో నిందితులు ఒకరిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రెండు చోట్లా అత్యంత రద్దీ ప్రదేశాల్లో ఆగంతుకులు ఇంతటి తెగింపు ప్రదర్శించడం గమనార్హం. బీదర్‌లో కాల్పులు జరిపింది బీహార్ ముఠాగా గుర్తించారు. వారం రోజుల క్రితం ఛత్తీస్‌ఘడ్ దోపిడీకి పాల్పడిన బీహార్ ముఠా.. హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్.. అక్కడ నుంచి బీహార్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీదర్‌లో రెండు రోజులుగా రెక్కీ చేసి మరీ అమిత్ కుమార్ ముఠా దోపిడీ చేసింది. అనంతరం బీదర్‌లో దోపిడీ చేసిన నగదును హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఇక్కడ రెండు బ్యాగ్‌లను కొనుగోలు చేసిన ముఠా.. అఫ్జల్‌గంజ్‌లో కొనుగోలు చేసిన బ్యాగ్‌లలోకి డబ్బులు నింపి అనంతరం పరారయ్యారు. పలు దోపిడీ కేసులో అమిత్ కుమార్ కీలక నిందితుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులతో బీదర్ పోలీసులు కలిసి రాయ్‌పూర్ వెళ్లారు. రాయ్‌పూర్, బీహార్‌లో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి దుండగులను పట్టుకుందనేందుకు యత్నిస్తున్నారు. కాల్పుల ఘటనలో నిందితులను పట్టుకునేందుకు మొత్తం 10 టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సిటీ శివారులు అన్ని ప్రాంతాల్లో గాలిస్తున్నామన్నారు. ఇద్దరి కదలికలు అనుమానంగా ఉండటంతో డ్రగ్స్, గంజాయి ఏమైనా తరలిస్తున్నారా అనే అనుమానంతో ట్రావెల్స్ సిబ్బంది జహంగీర్ బ్యాగ్‌లు తనిఖీ చేయాలని పట్టుబట్టాడని తెలిపారు. అందులో డబ్బు ఉండటంతో హవాలా డబ్బుగా అనుమానించిన జహంగీర్ పోలీసలకు చెప్తాను అని అన్నాడని.. దీంతో వెంటనే దండుగులు అతనిపై

కాల్పులు జరిపినట్లు చెప్పారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో పారిపోయారని.. ట్యాంక్ బండ్ వరకు వెళ్ళారన్నారు. అక్కడి నుంచి బీహార్ వెళ్ళి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు.

వేగుచుక్క

# పసుపు బోర్డుకు నిధులు కేటాయించండి.

## - కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన ఎంపీ అర్వింద్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 17:**

జిల్లాల్లో ఇటీవల పసుపు బోర్డు ఏర్పాటు చేసిన నేపథ్యంలో బడ్జెట్ లో తగిన నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి నిర్మలసీతారామన్ ను ఎంపీ అరవింద్ కోరారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రిని ఎంపీ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నిజామాబాద్ కు పసుపు బోర్డు కేటాయించిన తర్వాత జరుగుతున్న పరిణామాల గురించి, రైతుల హర్షం పట్ల మంత్రికి వివరించారు. వచ్చే నెలలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు నిధులను కేటాయించాలని కోరారు. ఇది వరకే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బోర్డు ఏర్పాటయిందని, అధికారుల నియామకం జరిగిందని, వ్యవస్థ గత నిర్మాణం కోసం నిధులను కేటాయించాలని కోరారు.



# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి.

## - అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.

## నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 17:**

సీసీ రోడ్, డ్రైనేజీ పనులు నాణ్యతతో, త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను అధికారులను అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త ఆదేశించారు. నగరంలోని 35వ డివిజన్ శివాజీ విగ్రహం జైన్ మందిర్, 36వ డివిజన్ చత్రపతి హనుమాన్ మందిర్ వద్ద, 37వ డివిజన్ అంబేద్కర్ కాలనీ ఎస్సీ సంఘం వద్ద లో మరియు 43 వ డివిజన్ లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శుక్రవారం మేయర్ నీతూ కిరణ్ తో కల్సి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, 14 వ ఫైనాన్స్ ద్వారా ప్రతి డివిజన్ కు పదిలక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా నగరంలో పలు డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులు నాణ్యతతో ఎటువంటి జాప్యం లేకుండా త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. నిజామాబాదు అర్బన్ నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా నియోజకవర్గం అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు వంద కోట్లు మంజూరు చేయాలనీ ఇంచార్జ్ మంత్రి జూపల్లికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# టియు ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి నియామకం.

## - డా. మావురపు సత్యనారాయణ రెడ్డికి విసి టి. యాదగిరి రావు నియామకపు ఉత్తర్వులు అందింజేత.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, జనవరి 17**

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాదిపతి గా డా. మావురపు సత్యనారాయణ రెడ్డి ని నియమిస్తూ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు శుక్రవారం నియామకపు ఉత్తర్వులు అందించారు.
ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ యాదగిరిరావు మాట్లాడుతూ, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి ప్రసిద్ధి చెందిన జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం న్యూ ఢిల్లీ నుండి పీహెచ్డీ కొరకు మధుమేహం వ్యాధి నివారణ పై జరిపిన పరిశోధనలు గుర్తించదగినవని పేర్కొన్నారు. పీహెచ్డీ అనంతరం అమెరికాలోని ప్రఖ్యాత రడ్ గర్స్ విశ్వవిద్యాలయం లో క్యాన్సర్ వ్యాధి నివారణకు జరిగిన పరిశోధన ఫలాలుగా పది అంతర్జాతీయ పేటెంట్లు సొంతం చేసుకోవడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని తెలిపారు. ఈ పరిశోధనల అనుభవాన్ని విశ్వవిద్యాలయ విద్యార్థులకు



అందించి విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని
సూచించారుప్రస్తుతం విశ్వవిద్యాలయ కళాశాలకు వైస్ ప్రిన్సిపల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ సత్యనారాయణ రెడ్డి గతంలో అడిషనల్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా, పబ్లికేషన్ సెల్ మరియు ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ లకు డైరెక్టర్ గా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, తన మీద
నమ్మకంతో విభాగాధిపతిగా నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు సైన్స్ డీన్ ఆచార్య సిహెచ్ ఆరతి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ బోయపాటి శిరీష, అకాడమిక్ కన్సల్టెంట్లు తదితరులు అభినందించారు.

# డిఎంహెచ్ఓ పేరిట అక్రమ వసూళ్లు.

## ఓ కాంట్రాక్టు ఉద్యోగి బరి తెగింపు.

## పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్ఎంపీ, పీఎంపీలు

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 17**

మెడికల్ ఆఫీసర్నని చెపుతూ, డీఎంహెచ్వో పేరిట ఆర్ఎంపీ,పీఎంపీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి బాగోతం శుక్రవారం జిల్లాలో బహిర్గతం అయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. దేవునిపల్లి పల్లె దవాఖానాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న బాలకృష్ణ తాను దేవునిపల్లి మెడికల్ ఆఫీసర్నని చెప్పుకుంటూ, ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద వసూళ్లు చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం లింగంపేట మండలకేంద్రంలో ఓ ఆర్ఎంపీ వద్దకు వచ్చి డీఎంహెచ్వో పేరిట రూ.15వేలు వసూలు చేశాడు. అక్కడి నుంచి మరో ఆర్ఎంపీ వద్దకు వెళ్లి రూ.20వేలు డిమాండ్ చేయగా, అతను బతిమాలి రూ.10వేలు ఇచ్చాడు. అయితే, కొద్దిసేపటికి అనుమానం వచ్చి నిలదీయడంతో పొంతనలేని సమాధానమిచ్చాడు. దీంతో అతనికి దేహశుద్ధి చేసి పోలీస్స్టేషన్లో అప్పగించారు.



# నల్గొండ కలెక్టర్ త్రిపాఠి సంచలన నిర్ణయం..

నల్గొండ కలెక్టర్ త్రిపాఠి సంచలన నిర్ణయం తీసుకున్నారు. నల్గొండ జిల్లా పరిధిలో ఉన్న 99 మంది పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ బ్రేక్ చేస్తూ కఠిన నిర్ణయం తీసుకున్నారు. జిల్లా పరిధిలో పని చేస్తున్న 99 మంది పంచాయతీ కార్యదర్శులు.. గత కొన్ని నెలలుగా విధులకు హాజరుకావటం లేదని.. అది కూడా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమలు తీసుకోకుండానే విధులకు గైర్హాజరయ్యారని తెలుసుకున్న కలెక్టర్ త్రిపాఠి.. సర్వీస్ బ్రేక్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

సంచలన నిర్ణయాలతో దూసుకెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి సర్కారులో.. అధికారులు కూడా అదే స్పీడుతో.. అంతే కఠిన నిర్ణయాలు తీసుకుంటూ పాలన సాగిస్తున్నారు. ఇందులో భాగంగానే.. నల్గొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏకంగా 99 మంది పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ బ్రేక్ చేస్తూ.. కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. కలెక్టర్ త్రిపాఠి తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నెలల తరబడి విధులకు రాకపోవటం వల్లే కలెక్టర్ త్రిపాఠి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.



నల్గొండ జిల్లా పరిధిలో పని చేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులు గత కొన్ని నెలలుగా విధులకు హాజరుకావటం లేదు. ఈ విషయం ప్రస్తుతం కలెక్టర్ త్రిపాఠి దృష్టికి చేరటంతో.. రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. మొత్తం 99 మంది పంచాతీయ కార్యదర్శులు గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు విధులకు హాజరు కాలేదని తేలింది. పోటీ పరీక్షల పేరుతో నెలల తరబడి విధులకు హాజరుకావట్లేదని తెలిసింది.

అయితే.. వీళ్లంతా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే విధులకు గైర్హాజరైనట్టు తెలియటంతో.. చర్యలకు ఉపక్రమించారు. విధులకు రాని 99 మంత్రి పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ బ్రేక్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తూ కఠిన నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా.. వీళ్లందరినీ ప్రస్తుతం పని చేస్తున్న చోటు కాకుండా.. మరో చోటికి బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.కలెక్టర్ ఉత్తర్వులతో ఆయా పంచాయతీ కార్యదర్శులు కంగుతిన్నారు. కలెక్టర్ త్రిపాఠి తీసుకున్న ఈ నిర్ణయాన్ని పంచాయతీ కార్యదర్శులు వ్యతిరేకిస్తున్నారు. సర్వీస్ బ్రేక్ ఆదేశాలతో భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు ఉంటాయా అనే ఆందోళన చెందుతున్నారు.

సమాచారం లేకుండా విధులకు దుమ్మా కొట్టే సిబ్బందిని సస్పెండ్ చేయాల్సి ఉంటుందని.. కానీ కలెక్టర్ త్రిపాఠి మాత్రం సర్వీస్ బ్రేక్ చేసి.. తిరిగి వాళ్లందరినీ విధుల్లోకి తీసుకున్నారని అధికారులు చెప్తున్నారు.

# అందులో ఎలారా నాయనా..!

హైదరాబాద్ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చాలని ప్రభుత్వం, పోలీసులు అన్ని రకాలుగా ప్రయత్నిస్తుంటే.. స్మగ్లర్లు మాత్రం చాప కింద నీరులా డ్రగ్స్ను సరఫరా చేస్తూ సైలెంట్గా దందా సాగిస్తూనే ఉన్నారు. ఎవ్వరికీ కనీసం అనుమానం కూడా రాకుండా రకరకాల మార్గాల్లో మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఇలా కూడా స్మగ్లింగ్ చేయొచ్చా అని నివ్వెరపోయేలా డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.

పుష్ప సినిమా చూసి అందులో హీరో స్మగ్లింగ్ చేసే పద్ధతి చూసి.. అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఇలా కూడా స్మగ్లింగ్ చేయొచ్చా అనేలా సినిమాలో ఉన్న కొన్ని సీన్లు చూసి.. ఎలా వస్తాయిరా సామీ ఇలాంటి ఐడియాలు అనుకున్నారు. కానీ.. పుష్ప సినిమా రాకముందు నుంచే అలాంటి చావు తెలివితేటలతో అక్రమ రవాణా జరుగుతోంది. సినిమాలో కేవలం ఎర్రచందనం స్మగ్లింగ్ గురించి చూపిస్తే.. బయట మాత్రం గంజాయి, డ్రగ్స్, డబ్బులు, బంగారం.. ఇలా ఒకటేమిటీ స్మగ్లింగ్ చేసే అవకాశమున్న ప్రతి ఐటెంను.. ఛాన్స్ ఉన్న ఏ మార్గాన్ని వదలకుండా తరలిస్తున్నారు. పోలీసులు డేగ కన్నేసి పట్టుకుని వెలుగులోకి తీసుకొస్తుంటే.. అమ్మ బాబోయ్.. అని ముక్కున వేలేసుకుంటున్నారు.

కొందరు స్మగ్లర్లు ఎంచుకునే మార్గాలు చూస్తుంటే.. పుష్ప సినిమాలో చూపించిన సీన్లు ఎందుకూ పనికిరావు అన్నట్టుగా ఉంటాయి. అచ్చంగా అలాంటి అక్రమరవాణా గుట్టును రాచకొండ పోలీసులు రట్టు చేశారు. నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పెద్ద మొత్తంలోనే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.23 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

అయితే.. 23 లక్షలంటే కాస్త చిన్న మొత్తమే అయినప్పటికీ.. సరుకును సరఫరా చేస్తున్న విధానం చూస్తే.. "ఎలా వస్తాయిరా సామీ ఇలాంటి ఐడియాలు.. మరీ అందులో పెట్టి ఎలా తరలిస్తున్నార్రా నాయనా.." అని అనకమానరు. నివ్వెరపోయేలా చేసే.. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాచకొండ సీపీ సుధీర్ బాబు వివరించారు.

రాజస్థాన్కు చెందిన మహేష్, మహిపాల్ అనే ఇద్దరు అంతరాష్ట్ర నిందితులు.. హైదరాబాద్లో అధిక ధరలకు హెరాయిన్ విక్రయిస్తున్నారని సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. నిందితులిద్దరూ రాజస్థాన్కి చెందినవారైనా నేరేడ్మెట్ ప్రాంతంలో స్థిరపడ్డారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో రకరకాల మార్గాలు వెతుక్కుంటున్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారు. కాగా.. గ్యాస్ రిపేర్కి సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. అది కూడా.. ఎవరికీ కొంచెం కూడా అనుమానం రాకుండా.. గ్యాస్ సిలిండర్ వాల్వ్లలో ప్యాక్ చేసి విక్రయిస్తుండటం గమనార్హం.

కేవలం ఇదే కాదు.. ఓలా, ఊబర్, ర్యాపిడో లాంటి మార్గాల ద్వారా కూడా మాదకద్రవ్యాలను కస్టమర్లకు చేరవేస్తున్నట్టు సీపీ తెలిపారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. రాజస్థాన్కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు.

2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేసినట్టు సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామన్నారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే.. ప్రజల సహకారం కూడా కావాలని కోరారు. డ్రగ్స్ గురించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీపీ తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాని సీపీ తెలిపారు.

# అసలు సిసలు ఆర్ఎస్ఎస్ మనిషి


ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ను పొగిడిన రేవంత్ రెడ్డినే అసలు సిసలు ఆర్ఎస్ఎస్ మనిషి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ను పొగిడిన రేవంత్ రెడ్డినే అసలు సిసలు ఆర్ఎస్ఎస్ మనిషి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఒకరినొకరు విమర్శించుకుంటారు అని కేటీఆర్ పేర్కొన్నారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ..
హెగ్డేవార్ను పొగిడిన రేవంత్ రెడ్డినే అసలు సిసలు ఆర్ఎస్ఎస్ మనిషి.



ఏబీవీపీలో పనిచేసి, ఆర్ఎస్ఎస్ ప్రింటింగ్ ప్రెస్లో పనిచేసింది రేవంత్ రెడ్డి. ఆయన వేసుకున్న నిక్కర్ కూడా ఖాకీ నిక్కర్ అని గతంలో అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బీజేపీ కాంగ్రెస్, ఈడీ ఏసీబీ కలిసి కేసులు పెట్టుకు న్నా.. మేము ప్రజల తరపున ప్రశ్నించడం ఆపే ప్రసక్తే లేదని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసినట్టు చెప్పుకుంటున్న రేవంత్ మాటలు ఈ సంవత్సరం జోక్. ప్రజలను మోసం చేసింది చాలక.. ఇక ఇప్పుడు ఢిల్లీ ప్రజలను మోసం చేసేందుకు రేవంత్ సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన ప్రతిచోట మోసాలకు పాల్పడుతుంది. కాంగ్రెస్ పార్టీని ఢిల్లీలో కూడా ముమ్మాటికి ప్రజలు తిరస్కరిస్తారు. ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు ఢిల్లీలో కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుంది.
నిన్నటిదాకాఅరవింద్ కేజ్రీవాల్పైన రేవంత్ రెడ్డి అడ్డగోలుగా నోరుపారేసుకు న్నారు. రేవంత్ రెడ్డి ఒక అవకాశవాది, మోసకారి. ఆయన ఎన్నికల హామీ తప్పితే ఏమనాల్సిన అవసరం లేదు. కానీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసి వెళ్లిపోయారు. తెలంగాణ కాంగ్రెస్ చేస్తున్న మోసాలపైన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీలను నిలదీయాలి. ఇంతగా ఇక్కడి ముఖ్యమంత్రి మోసం చేస్తున్నా కాంగ్రెస్ పెద్దలు ఎందుకు అడగడం లేదో ప్రజలు ఆలోచించాలని కేటీఆర్ సూచించారు.

వేగుచుక్క

# ప్రమాదంలో సినీ ఇండస్ట్రీ మనుగడ




రామ్ చరణ్ హీరోగా నటించి సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'గేమ్ ఛేంజర్' సినిమాకు నెగటివ్ రివ్యూలు వచ్చాయి. అయినా సంక్రాంతి సీజన్ కలిసి వచ్చి బాక్సాఫీస్ వద్ద బాగానే వసూళ్లను రాబడుతోంది. కానీ విడుదలైన రెండు రోజుల్లోనే హెచ్‌డీ ప్రింట్‌తో గేమ్ ఛేంజర్‌ను కొందరు పనిగట్టుకుని లీక్ చేశారు. లోకల్ ఛానల్స్, బస్సుల్లోనూ గేమ్ ఛేంజర్ సినిమా అప్పుడే ప్రసారం అవుతోంది. ఈ విషయం మొత్తం ఇండస్ట్రీకి షాకింగ్‌గా మారింది. ఈ విషయమై నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించారు.

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించిన 'గేమ్ ఛేంజర్' సినిమా జనవరి 10న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కియారా అద్వానీ, అంజలి హీరోయిన్స్‌గా నటించిన ఈ సినిమాలో ఎస్ జే సూర్య, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించారు. ఈ పొలిటికల్ డ్రామాకి నెగటివ్ రివ్యూలు వచ్చాయి. అయితే సంక్రాంతి సీజన్ కావడంతో వసూళ్లు బాగానే వస్తున్నాయని ప్రొడక్షన్ హౌస్ నుంచి ప్రకటనలు వస్తున్నాయి. అయితే డీసెంట్ ఓపెనింగ్స్ రాబట్టుకున్న ఈ సినిమా విడుదలైన రెండు రోజుల్లోనే లీక్ అయ్యింది. హెచ్‌డీ క్వాలిటీ ప్రింట్‌ను ఇంటర్నెట్ ద్వారా లీక్ చేశారు. కొందరు కావాలని ఈ పని చేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సోషల్ మీడియాలో గేమ్ ఛేంజర్ విడుదలైనప్పటి నుంచి నెగటివ్ టాక్ స్ప్రెడ్ చేయడం, కథలోని మెయిన్ పాయింట్స్‌ను రివీల్ చేయడం, సస్పెన్స్ ఎలిమెంట్స్‌ను రివీల్ చేయడం, స్పాయిలర్ రివ్యూలు ఇవ్వడం వంటివి కొందరు చేస్తూ వచ్చారు. వారే సినిమా ఇంటర్నెట్‌లో లీక్ అయ్యింది, ఈ లింక్ క్లిక్ చేసి సినిమాను చూడండి అంటూ సోషల్ మీడియా ద్వారా పోస్ట్‌లు పెట్టారు. దాదాపు 45 మంది సినిమాను కిల్ చేసేందుకు చూశారు అంటూ నిర్మాతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సోషల్ మీడియా ఐడీలతో పాటు, వారు షేర్ చేసిన పోస్ట్‌ల తాలూకు స్క్రీన్ షాట్‌లను సైతం పోలీసులకు నిర్మాతలు అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎంక్వైరీ మొదలు పెట్టారు.

ఇక గేమ్ ఛేంజర్ లీక్ అయ్యి లోకల్ ఛానల్, బస్సుల్లో ప్రసారం కావడంపై నిర్మాత ఎస్‌కేఎన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ... కేవలం 5 రోజుల క్రితం వచ్చిన సినిమాను టీవీల్లో, బస్సుల్లో ప్రసారం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇలాంటి సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక సినిమా అంటే హీరో, దర్శకుడు, నిర్మాత మాత్రమే కాదు. వేలాది మంది ఏళ్లకు ఏళ్లు కష్టపడి పని చేస్తేనే సినిమా రెడీ అవుతుంది. ఎంతో మంది కలలు కంటూ సినిమా కోసం వర్క్ చేస్తారు. సినిమా ఇలా లీక్ కావడం వల్ల డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్లు తీవ్రంగా నష్టపోతారు అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఇలాంటి ఘటనలతో సినిమా ఇండస్ట్రీ మనుగడకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. మరి ఈ విషయంపై గేమ్ ఛేంజర్ నిర్మాతలు ఎలా ముందుకెళ్తారో చూడాలి.

# భలే దించేశారే!



ఇండస్ట్రీలో మెగాస్టార్ చిరంజీవికి అక్కినేని కుటుంబంతో ఉన్న అనుబంధం గురించి అందరికీ తెలిసిందే. దివంగత అక్కినేని నాగేశ్వరరావుతో అప్పట్లో చిరు కలిసి నటించారు కూడా. ఇక ఆ తర్వాత నాగార్జునతో చిరు బంధం చాలా గొప్పగా సాగింది. ఇటీవల ఏఎన్ఆర్ అవార్డును కూడా చిరు అందుకున్నారు. అయితే తాజాగా ఓ యాడ్‌లో మెగాస్టార్ చిరంజీవిని నాగార్జున ఇమిటేట్ చేయడం విశేషం. ఆయన డైలాగ్స్‌తో పాటు డ్యాన్స్ కూడా చేశారు నాగార్జున.


టాలీవుడ్‌లో నాలుగు స్తంభాలు అనగానే గుర్తొచ్చేది చిరంజీవి, బాలకృష్ణ , వెంకటేష్, నాగార్జున. ఎన్నో దశాబ్దాల పాటు ఇండస్ట్రీలో వీరి హవా కొనసాగింది.. కొనసాగుతుంది. ఇక వీరి మధ్య బాండింగ్ కూడా అలానే ఉంది. ముఖ్యంగా చిరంజీవి–నాగార్జున మధ్య స్నేహం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చిరంజీవిని ఎప్పుడూ సోదరభావంతో గౌరవించారు నాగ్. అలానే చిరు కూడా నాగ్‌పై అదే వాత్సల్యాన్ని చూపించారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవికి తన తండ్రి ఏఎన్ఆర్ అవార్డును కూడా నాగార్జున ప్రదానం చేశారు. ఇలా మెగాస్టార్–అక్కినేని ఫ్యామిలీల మధ్య బంధం చాలా ప్రత్యేకం. ఇంతకీ మేటర్ ఏంటంటే తాజాగా ఓ యాడ్ కోసం చిరంజీవిని ఇమిటేట్ చేశారు నాగార్జున.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు

ఎన్నో ఏళ్లుగా కళ్యాణ్ జువెలర్స్‌కి నాగార్జున యాడ్స్ చేస్తున్నారు. అయితే తాజాగా ఆయన చేసిన ఓ యాడ్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇందులో ఖైదీ 150లో చిరంజీవి చెప్పిన డైలాగ్‌ని నాగార్జున చెప్పారు. "ఏదైనా సరే నాకు నచ్చితేనే చేస్తా.. నచ్చితేనే చూస్తా.. కాదని బలవంతం చేస్తే కోస్తా" అంటూ వెనకాల చిరంజీవి డైలాగ్ వస్తుంటే నాగ్ లిప్ సింక్ ఇచ్చారు. అయితే ఇందులో మెగాస్టార్ మేనరిజం భలే పట్టేశారు నాగ్.

ఈ యాడ్‌లో నాగార్జున భార్య చిరంజీవి ఫ్యాన్. అయితే ఆమె గతం అంతా మర్చిపోతుంది. ఆమె పుట్టినరోజుకి జువెలరీ గిఫ్ట్‌గా ఇస్తారు నాగ్. అనంతరం పార్టీలో చిరంజీవి ఆల్ టైమ్ హిట్ సాంగ్ "మళ్లీ మళ్లీ ఇది రాని రోజు" సాంగ్ పాడుతూ డ్యాన్స్ చేస్తారు నాగ్. ఆ సమయంలో పాట ఆగిపోగానే ఆయన భార్య మిగిలిన చరణం పాడుతుంది. ఇలా యాడ్‌ని చాలా క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. ఇక ఈ యాడ్‌లో చిరుని నాగ్ ఇమిటేట్ చేయడం హైలెట్. అందుకే సోషల్ మీడియాలో ఈ యాడ్ తెగ వైరల్ అవుతుంది. మెగాస్టార్ ఫ్యాన్స్ ఈ యాడ్‌ని పోస్ట్ చేస్తూ నాగార్జునని ప్రశంసిస్తున్నారు. స్టార్ హీరో అయి ఉండి మరో హీరోని ఇమిటేట్ చేయడం నిజంగా ఆహ్వానించదగ్గ విషయం అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఈ యాడ్‌పై చిరు ఏమైనా స్పందిస్తారేమో చూడాలి. ప్రస్తుతానికి అయితే చిరంజీవి–నాగార్జున బాండింగ్ చాలా స్పెషల్ అంటూ ఇరువురి హీరోల ఫ్యాన్స్ పోస్టులు చేస్తున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే నాగార్జున ప్రస్తుతం ధనుష్ కుబేర చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ ఏడాది కుబేర రిలీజ్ కానుంది.

# కల్కి సీక్వెల్ రిలీజ్‌పై అశ్వినీదత్ అప్డేట్..



'కల్కి' సీక్వెల్ రిలీజ్‌పై అశ్వినీదత్ అప్డేట్..

ఆ ముగ్గురి పాత్రలు కీలకం

ప్రభాస్ ప్రధాన పాత్రలో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొంది గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కల్కి 2898' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దాదాపు రూ.1000 కోట్లకి పైగా వసూళ్లు రాబట్టిన కల్కి సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు సీక్వెల్ షూటింగ్ ప్రారంభించక పోవడంతో పాటు ఆ విషయం గురించి దర్శకుడు మాట్లాడటం లేదని ఫ్యాన్స్ ఒకింత నిరుత్సాహంతో ఉన్నారు. అయితే ఎట్టకేలకి సీక్వెల్‌పై నిర్మాత అశ్వినీదత్ క్లారిటీ ఇచ్చారు.

2024 సంవత్సరంలో వచ్చిన బిగ్గెస్ట్ సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో 'కల్కి 2898' సినిమా ఒకటి. ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకి మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. ఫ్యూచర్‌ని కళ్ల ముందుకి తీసుకు వచ్చిన కల్కి సినిమాకి రూ.1000 కోట్లకి పైగా వసూళ్లు నమోదు అయ్యాయి. ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్ పాత్రకి మంచి స్పందన దక్కింది. కమల్ హాసన్ పాత్ర ఉన్నప్పటికీ ఆయన కనిపించింది కొద్ది సమయం మాత్రమే. ఇక దీపికా పదుకునే సైతం కొన్ని సీన్స్‌కి పరిమితం అయ్యింది. పైగా ప్రభాస్‌కి జోడీగా ఆమె నటించలేదు. అయినా కాన్సెప్ట్ విభిన్నంగా ఉండటంతో పాటు పురాణాలను భవిష్యత్తుకు లింక్ చేసి చూపించిన తీరుకి అంత ఫిదా అయ్యారు.

కల్కి సినిమాలోనే సీక్వెల్ ఉంటుంది అంటూ అధికారికంగా ప్రకటించారు. కథను మధ్యలో ఆపేసిన దర్శకుడు నాగ్ అశ్విన్ సీక్వెల్‌ను ఎప్పుడు తీసుకు వస్తాడా అంటూ ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు సినిమాను చూసిన వారు అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమధ్య జరిగిన ఒక ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఇప్పటికే కల్కి సీక్వెల్ షూటింగ్ కొంత మేరకు జరిగింది. త్వరలోనే నాగ్ అశ్విన్ సీక్వెల్ షూటింగ్ ప్రారంభిస్తారని నిర్మాతలు పేర్కొన్నారు. తాజాగా మరోసారి నిర్మాత అశ్వినీదత్ కల్కి సీక్వెల్‌పై స్పందించారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇంటర్వ్యూలో అశ్వినీదత్ మాట్లాడుతూ... కల్కి 2898 సీక్వెల్‌ను వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తామన్నారు. రెండో పార్ట్‌లో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ పాత్రలు కీలకంగా ఉంటాయి. ముఖ్యంగా కమల్ హాసన్ ఎక్కువగా కనిపిస్తారు. ప్రభాస్, కమల్ హాసన్ కాంబినేషన్ సీన్స్ ఉంటాయని చెప్పుకొచ్చారు. ఈ ముగ్గురితో పాటు దీపికా పదుకునే పాత్ర సైతం సెకండ్ పార్ట్‌లో కంటిన్యూ కానుంది. కొత్త నటీనటులను తీసుకునే విషయమై నాగ్ అశ్విన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి షూటింగ్‌ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ఆయన కల్కి సీక్వెల్ గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. సీక్వెల్‌లో ఎక్కువ మహాభారత సన్నివేశాలు ఉంటాయని, శ్రీకృష్ణుడి పాత్రను మరింతగా చూపించే అవకాశాలు ఉన్నాయి అంటూ సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు దర్శకుడు నాగ్ అశ్విన్ ఏ చిన్న లీడ్‌ను ఇవ్వలేదు. కనుక ఇప్పటి వరకు సీక్వెల్ గురించి వచ్చిన వార్తలు అన్నీ పుకార్లే. ఏప్రిల్‌లో సినిమా షూటింగ్ ప్రారంభం అయితే అప్పుడు ఏమైనా లీక్‌లు వస్తాయేమో చూడాలి. ప్రభాస్ ఈ ఏడాది మారుతి దర్శకత్వంలో నటిస్తున్న రాజాసాబ్ సినిమాతో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో చేస్తున్న ఫౌజీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వచ్చే ఏడాదిలో సలార్ 2 తో పాటు కల్కి 2 సినిమాలతో రాబోతున్నారు.

# డైరెక్టర్ శంకర్‌పై మెగా ఫ్యాన్స్ ట్రోల్స్..




"నేను అనుకున్న ప్రకారం అయితే సినిమా నిడివి 5 గంటల వరకు ఉండాలి. కానీ టైమ్ దృష్ట్యా కొన్ని మంచి సీన్లు కట్ చేశాం.. అందుకే కథ నేను అనుకున్న విధంగా రాలేదు".. ఇవి గేమ్ ఛేంజర్ సినిమా గురించి రీసెంట్ ఇంటర్వ్యూలో శంకర్ చేసిన కామెంట్స్. ఇప్పుడు ఈ మాటలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. అయిన సినిమా రిలీజ్ అయిన తర్వాత శంకర్ ఈ మాటలు మాట్లాడాల్సిన అవసరం ఏంటో ఎవరికీ అర్థం కావడం లేదు.

ఇక ఔట్‌పుట్‌తో తాను సంతృప్తిగా లేనని డైరెక్టర్‌యే చెప్పడం ఏంటో మెగా ఫ్యాన్స్‌కి అసలు అర్థం కావడం లేదు. ఆయనకి నచ్చనప్పుడు సినిమాని నచ్చేలా తీసి ఉండొచ్చుగా అంటూ మెగా ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. ఇంకొంతమంది అయితే డైరెక్టర్ శంకర్‌ని ట్రోల్ చేస్తున్నారు. వాల్తేరు వీరయ్య టైమ్‌లో డైరెక్టర్ల పనితనం గురించి చిరంజీవి చేసిన కామెంట్లు అప్పట్లో వైరల్ అయ్యాయి. ఆ వీడియోతోనే శంకర్‌ని ట్రోల్ చేస్తున్నారు మెగా ఫ్యాన్స్.

"కావాల్సిన మేరకు మీరు కుదించుకొని ఆలోచించుకొని, రాస్తున్నప్పుడే విజువలైజ్ చేసుకొని, రాసుకుంటున్నప్పుడే ఎడిటింగ్ చేసుకునే ఇన్ని క్రాఫ్ట్‌లు డైరెక్టర్‌కి ఉండాలి. కొంతమంది చెబుతారు ఇది షూట్ చేసేసి కావాలంటే పెడదాం సార్ అని.. కానీ డైరెక్టర్‌కి ఒక ఆలోచన ఉండాలి.. లేదు లేదు ఈ షాట్ వస్తుంది ఇంత లెంథ్ సరిపోతుందని.. ఎందుకంటే ఈ షాట్ కోసం మళ్లీ మళ్లీ చేస్తుంటే ఆర్టిస్టులకి ఒళ్లు హూనం అయిపోతుంది.

అలాగే ఎంత డబ్బు వేస్ట్ అయిపోతుంది.. ఎంత టైమ్ వేస్ట్ అయిపోతుంది.. ఇది కాదుగా ఎడిటింగ్ ఇది సరిపోతుంది.. అనే ఆలోచన ఉండాలి.. అలా తీసుకుంటే ఆర్టిస్టులకి కంఫర్టబుల్, నిర్మాతలకి కంఫర్టబుల్.. డైరెక్టర్ విత్ ఇన్ టైమ్‌లో సినిమా తీసినట్లు ఉంటుంది.. ఇది ప్రతి వాళ్లకి ఒక ఎడ్యుకేషన్. " అంటూ చిరు అన్నారు. ఈ వీడియో ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతోంది. మరోవైపు శంకర్ కామెంట్లపై తమిళ ఆడియన్స్ కూడా ఫైర్ అవుతున్నారు. అయినా డైరెక్ట్ చేసేటప్పుడే ఏది కావాలి.. ఏది వద్దు అనే విషయంపై ఒక దర్శకుడికి క్లారిటీ ఉండాలి కదా.. ఇలా ఒక హీరో ప్రైమ్ టైమ్‌ని ఇలా వేస్ట్ చేస్తారా అంటూ పోస్టులు పెడుతున్నారు. గతంలో శంకర్ టేకింగ్, డైరెక్షన్ ఏ రేంజ్?లో ఉండేవో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.. కానీ అలాంటి డైరెక్టర్ ఇప్పుడు తన ప్రాజెక్టుని తాను సరిగా ఎడిట్ చేయలేకపోవడమేంటో అర్థం కావడం లేదు అంటున్నారు ఫ్యాన్స్.

# హీరోహీరోయిన్లు ఎవరంటే..

టీజర్ అదుర్స్

90మిడిల్ క్లాస్ బయోపిక్ అంటూ ఈటీవీ విన్‌లో వచ్చిన వెబ్ సిరీస్ సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రతి ఒక్క 90కిడ్ ఒక్కసారిగా తమ జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయేలా చేసింది ఈ సిరీస్. తాజాగా ఈ సిరీస్‌కి సీక్వెల్ ప్రకటించారు. అయితే ఈసారి వెబ్ సిరీస్‌గా కాకుండా సినిమాగా థియేటర్లలో సందడి చేయబోతుంది. ఇక ఈ సినిమాలో హీరోగా ఆనంద్ దేవరకొండ యాక్ట్ చేస్తుండటం విశేషం. ఇందుకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ టీజర్ చూద్దాం.

'90'మిడిల్ క్లాస్ బయోపిక్'.. ఈ వెబ్ సిరీస్‌ని ఆడియన్స్ అస్సలు మర్చిపోలేరు. ఎందుకంటే తెరపై తమ జీవితాల్ని మళ్లీ చూసుకునే అవకాశం వస్తే ఏ ఆడియన్స్ చూడకుండా ఉంటారు చెప్పండి. ముఖ్యంగా 90%o% కిడ్స్ ఈ సిరీస్‌కి చాలా కనెక్ట్ అయిపోయారు. వారి చిన్ననాటి స్కూల్ లైఫ్, ఇంట్లో పరిస్థితులు, ఆడుకున్న ఆటలు, లవ్ ట్రాక్‌లు ఇలా ఒకటా రెండో ప్రతిదీ అద్దంలో చూసుకున్నట్లే అనిపించింది. అంతలా రిలేట్ చేసుకున్నారు కనుకే ఈ సిరీస్ అంత పెద్ద సక్సెస్ అయింది. అయితే ఈ సిరీస్‌కి సీజన్ 2 ఉంటుందని అప్పుడే ప్రకటించారు. కానీ తాజాగా సీజన్ 2 కాకుండా సినిమాగా ఈ సిరీస్‌కి సీక్వెల్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ టీజర్ వచ్చేసింది.



ఇక తాజాగా వదిలిన టీజర్‌లో తల్లిదండ్రుల పాత్రల్లో శివాజీ, వాసుకి ఆనంద్ కంటిన్యూ అయ్యారు. అయితే చిన్న కొడుకు ఆదిత్య పాత్రని హీరో ఆనంద్ దేవరకొండ కనిపించడం విశేషం. అంటే 10 సంవత్సరాల తర్వాత వస్తున్న కథ కనుక ఆ పాత్రలో నటించిన రోహన్ రాయ్‌ని తప్పించాల్సి వచ్చింది. కానీ టీజర్‌లో మాత్రం రోహన్ రాయ్‌ని కూడా చూపించి ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేశారు.

ఇక ఈ సినిమాకి మరో హైలెట్ ఏంటంటే హీరోయిన్‌గా వైష్ణవి చైతన్య నటిస్తుంది. తనని టీజర్‌లో పరిచయం చేయకపోయినా టైటిల్ కార్డ్స్‌లో చూపించారు. అంటే బేబీ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఆనంద్ దేవరకొండ–వైష్ణవి చైతన్య కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ ఇదే. ఇక చిన్న కొడుకు ఆదిత్య.. లండన్ వెళ్లడానికి రెడీ అవుతున్నాడన్నమాట. ఇక్కడి నుంచి ఈ కథ మొదలుకానుంది. అక్కడ వైష్ణవి చైతన్యతో ప్రేమలో పడటం.. లవ్ స్టోరీ ఎలా సాగింది అనేది ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఇది నా స్టోరీ.. మీ స్టోరీ.. మన స్టోరీ అంటూ ఈ టీజర్‌కి క్యాప్షన్ ఇచ్చారు.

ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే లండన్‌లో ప్రారంభమైంది. ఈ సినిమా గురించి మిగిలిన వివరాలు త్వరలోనే తెలియబోతున్నాయి. ఇక ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెరకెక్కిస్తుంది. 90మిడిల్ క్లాస్ బయోపిక్‌ని తెరకెక్కించిన ఆదిత్య హాసన్‌యే ఈ సీక్వెల్‌ని డైరెక్ట్ చేస్తున్నారు. మరి అప్పుడు ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ కనెక్ట్ అయిన ఈ సిరీస్‌ని ఇప్పుడు లవ్ స్టోరీగా తీస్తున్నారు. మరి ఇది ఎంతవరకూ కనెక్ట్ అవుతుందో చూడాలి. మొత్తానికి ఈ ప్రాజెక్ట్‌పై ఆడియన్స్‌లో ఇంట్రెస్ట్ అయితే బావుంది.

# జైలర్ 2 అనౌన్స్‌మెంట్ టీజర్ చూశారా?



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన జైలర్ సినిమా ఆయన కెరీర్‌లో చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఆ సినిమా ముందు వరుస ఫ్లాపుల్లో ఉన్నారు రజినీ. అలాంటి సమయంలో రిలీజై ఫ్యాన్స్ ఆకలి మొత్తం తీర్చేసింది జైలర్. తమిళ్‌తో పాటు తెలుగులో కూడా సూపర్ హిట్ అయిన ఈ చిత్రానికి ఎట్టకేలకి సీక్వెల్‌ని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. తాజాగా జైలర్ 2 అనౌన్స్‌మెంట్ టీజర్‌ని రిలీజ్ చేసింది సన్ పిక్చర్స్. దీనిపై ఓ లుక్కేద్దాం.

2023లో రిలీజైన జైలర్ సినిమా రజినీకాంత్ కెరీర్‌లో భారీ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా రూ.650 కోట్లకి పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ చిత్రం ఫ్యాన్స్‌కి మాస్ ట్రీట్ ఇచ్చింది. అసలు రజినీకాంత్ స్క్రీన్ మీద అలా నడిచొస్తుంటే ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయారు. రజినీకి తోడు మోహన్ లాల్, శివరాజ్‌కుమార్ చేసిన కేమియోలు కూడా బాగా వర్కవుట్ అయ్యాయి. ఇక తమన్నా స్పెషల్ సాంగ్, యోగిబాబు, సునీల్ కామెడీ ఇలా ప్రతిదీ సినిమాకి బాగా ప్లస్ అయ్యాయి. ఇక జైలర్ సీక్వెల్ కోసం ఎప్పటి నుంచో ఆడియన్స్ ఎదురుచూస్తున్నారు. వారందరికీ గుడ్ న్యూస్ ఇస్తూ తాజాగా అఫీషియల్ జైలర్ 2ని ప్రకటించారు.

సన్ పిక్చర్స్ సంక్రాంతి సందర్భంగా జైలర్ 2 అనౌన్స్‌మెంట్ టీజర్‌ని విడుదల చేసింది. డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ సరదాగా మాట్లడుకుంటున్నట్లుగా ఈ టీజర్ మొదలైంది. ఇంతలో సడెన్‌గా రజినీకాంత్ రౌడీలని తరుముకుంటూ స్టైయిల్‌గా ఎంట్రీ ఇచ్చారు. అనంతరం రజినీ కోసం వచ్చిన విలన్లపై రజినీ సైగతో మిసైల్ వర్షం కురిసింది. ఇక దీనికి అనిరుధ్ ఇచ్చిన జైలర్ బీజీఎం తోడు కావడంతో టీజర్ మాములుగా లేదు. ఇక ఈ టీజర్‌లో నెల్సన్, అనిరుధ్ తెలుగులో ఓన్ డబ్బింగ్ చెప్పడం విశేషం. ఈ టీజర్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. జైలర్ 2 అనౌన్స్‌మెంట్ టీజర్ హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉంది. ఈ టీజర్ చూసి ఫ్యాన్స్ తెగ పోస్టులు పెడుతున్నారు. అసలు తలైవా వాకింగ్ చేసి వస్తే చాలు రికార్డులు గల్లంతే అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఒక్క అనౌన్స్‌మెంట్ టీజర్‌తోనే తలైవా పవర్ ఏంటో చూపించాడు డైరెక్టర్ నెల్సన్.

మరి ఈ సీక్వెల్‌కి ఎలాంటి కథని రాసుకున్నారు.. కొత్త క్యారెక్టర్లు ఏం వస్తాయి అనేది తెలియాల్సి ఉంది. అలానే ఈ సారి జైలర్ 2లో ఏ స్టార్ హీరోలు కేమియోలు చేస్తారనేదానిపై ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే జైలర్ సినిమాలో విలన్‌గా నటించిన వినాయకన్ పాత్ర ఎండ్ అయిపోయిన సంగతి తెలిసిందే. మరి ఈ సీక్వెల్‌కి ఎవరు విలన్‌గా నటిస్తారో చూడాలి. తమిళ్‌తో పాటు తెలుగు ప్రేక్షకుల్లో కూడా ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం తలైవా.. లోకేష్ కనగరాజ్ డైరెక్షన్‌లో కూలీ చిత్రం చేస్తున్నారు. ఇది ఈ ఏడాది రిలీజ్ కానుంది. ఇది పూర్తయిన వెంటనే జైలర్ 2 సెట్స్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది.